

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### బహుమతి

**"నిజంగా నేనా** పని చేయలేదు" కృష్ణమూర్తి భార్య ఒళ్ళో తల దాచుకుంటూ బేలగా చెప్పాడు.

"నాకు తెలుసు" ఇందుమతి మృదువుగా చెప్పింది.

అతను ఏడుస్తున్నాడని గ్రహించి తల నిమురుతూ ఆప్యాయంగా చెప్పింది.

"ఊరుకోండి. మీరలాంటి మనిషి కాదని నాకు తెలుసు. లోకమంతా కోడై కూసినా నేనెంత మాత్రం నమ్మను. మీమీద నాకా నమ్మకం ఉంది."

"నేనసలు ఆ అమ్మాయిని ఆ దృష్టితో చూడలేదు.." వెక్కుతూ చెప్పాడు.

"నాకు తెలుసు. కొద్దిసేపు మాట్లాడకుండా పడుకోండి." ఇందుమతి అతన్ని పొదవి పట్టుకుని వీపు మీద చేత్తో తడుతూ చెప్పింది.

ఆ దురదృష్టకరమైన రోజు కృష్ణమూర్తి ఆఫీస్ పనిలో తలమునకలుగా ఉన్న సమయంలో ఆ అమ్మాయి తలుపు తీసుకుని అతని ఛాంబర్లోకి వచ్చింది.

"మీరే పని మీద వచ్చినా, బయట కూర్చుని అరగంట తర్వాత రండి. చాలా బిజీగా ఉన్నాను" విసుగ్గా చెప్పాడు.

"ఒక్క ఐదునిమిషాలే" ఆ అమ్మాయి బేగ్‌లోంచి ఏవో పేపర్లు తీస్తూ చెప్పింది.

"ఒక్క నిమిషం కూడా టైం లేదు. ప్లీజ్ బయటకి నడవండి" కఠినంగా చెప్పాడు.

ఆ అమ్మాయి ఆ మాటలు పట్టించుకోకుండా చెప్పింది.

"నేనొక ఎన్.జివోలో పనిచేస్తున్నాను. యజమాని ధనదాహానికి కార్మికుడు ఎంత అణగారిపోతున్నాడో కొన్ని ఉదాహరణలు చదవండి. అలాగే కార్మిక జనోద్ధరణకి మీకు తగిన సహాయం చేయండి."

పని వత్తిడిలో ఉన్న కృష్ణమూర్తికి ఆ మాటలకి చిర్రెత్తుకొచ్చింది.

"గెటౌట్. బయట మా కార్మికులని చూడండి. పని మానేసి పోచుకోలు కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళని మీరేం ఉద్ధరించక్కర్లేదు. మీ కార్మిక సోదరుల పని మేం చేయాలి కాని ఇక పదండి" పెద్దగా అరిచాడు.

ఆ అమ్మాయి అతని మొహంలోకి సూటిగా చూస్తూ నిదానంగా అడిగింది.

"చందా ఇవ్వనంటారు!"

"పైసా కూడా ఇవ్వను గెటౌట్" కృష్ణమూర్తి ఇంకా పెద్దగా అరిచాడు.

ఆ అమ్మాయి ఎంతో చాకచక్యంగా తన చీరని విప్పి జాకెట్‌ని రెండువైపులా బలంగా లాగింది. పటపట చప్పుడు చేస్తూ అది తెరుచుకుంది.

"ఏంటి? ఏం చేస్తున్నావ్?" కృష్ణమూర్తి విభ్రాంతిగా అడుగుతుండగానే ఆ అమ్మాయి పెద్దగా అరవసాగింది.

"హెల్ప్! హెల్ప్!"

ఆ తర్వాత కథంతా యధాప్రకారం నడిచింది. కృష్ణమూర్తి మాటలు ఎవరూ నమ్మలేదు. పోలీసులు అరెస్ట్ చేసి బెయిల్ మీద వదిలేసారు. టివి ఛానల్స్ వాళ్ళు 'మదమెక్కిన మగపిశాచి' 'కామాంధుడి చెరలో కన్నెపడుచు' లాంటి కేప్షన్స్‌తో చర్చా కార్యక్రమాలు పెడితే, ఎన్‌జివోలకి చెందిన అనేక మంది మహిళామణులు అందులో పాల్గొని కృష్ణమూర్తి చర్యలని ఖండించారు. అతను సస్పెండ్ అయ్యాడు.

"బయటకి వెళ్ళాలంటేనే భయం వేస్తోంది. అంతా నన్ను చూసి నవ్వుతున్నారు. నిజానిజాలు తెలుసుకోకుండానే ఇంత శిక్షా?" కృష్ణమూర్తి వాపోయాడు.

"మీరు అన్నం తిని రెండు రోజులైంది. ఎంత రాత్రప్పుడు చూసినా మెలుకువగానే ఉంటున్నారు. పిల్లలు 'నాన్నని జాగ్రత్తగా చూసుకొమ్మని ఒక్క నిముషం కూడా వంటరిగా వదలద్దు' అని ఫోన్లు. ఇలా ఉంటే ఎలా? పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు కదా? నిజం ఎప్పటికైనా బయట పడుతుంది." ఇందుమతి ఓదార్చింది.

"పిల్లలు నా గురించి ఏమనుకుంటున్నారు? కామాంధుడిననేనా?" దుఃఖంగా అడిగాడు.

"ఛీ లేదు నిన్న ఎవరో ఛానల్ వాళ్ళు వాళ్ళకి ఫోన్ చేసి అడిగితే 'మా నాన్న గురించి మాకు తెలుసు. ఆయన అలాంటి మనిషి కాదు. ఇదంతా ఏదో ట్రాప్?' అని చెప్పారట ఇద్దరూనూ."

కాలింగ్ బెల్ మోగింది.

"పనిమనిషి వచ్చినట్లుంది" ఇందుమతి బెడ్‌రూం తలుపుని దగ్గరకి వేసి బయటకి వెళ్ళింది.

కృష్ణమూర్తి మనసంతా అభిమానంతో నిండిపోయింది. ఇందుమతి తనకెంత సపోర్ట్ ఇస్తోంది? తనెప్పుడూ ఆమెని ఒక మనిషిలాగే చూడలేదు. మనిషిలాకాక పెళ్ళాంగా చూసాడు. అచ్చం తన తండ్రిలాగే. పిల్లల్నీ పట్టించుకోలేదు. ప్రోగ్రెస్ రిపోర్ట్ మీద సంతకాలు పెట్టడం తప్పించి ఏమీ కల్పించుకోలేదు. డబ్బవసరమై వాళ్ళు ఏభైరూపాయలు అడిగితే పదిరూపాయలు ఇచ్చేవాడు. మౌనంగా తీసుకునేవాళ్ళు తప్ప చాలదని అనేవాళ్ళు కాదు. ఆ చనువు తను వాళ్ళకి ఇవ్వలేదు. కానీ వాళ్ళు 'మా నాన్న గురించి మాకు తెలుసు అలాంటి మనిషి కాదు' అని తనకి సపోర్ట్‌గా నుంచున్నారు.

కృష్ణమూర్తికి దుఃఖం తన్నుకు వచ్చింది. దాదాపు పదినిమిషాలపాటు ఏడుస్తూనే ఉన్నాడు. పనిమనిషిని పంపించి తలుపు వేసి వచ్చిన ఇందుమతి అది చూసి కంగారుగా అడిగింది.

"మళ్ళీ ఏమైంది?"

"ఇలా రా" చేతులు చాచి పిలిచాడు.

ఆమె అయోమయంగానే అతని చేతుల్లోకి వెళ్ళింది. భార్యని గాఢంగా ఆలింగనం చేసుకుని అరనిమిషంపాటు మళ్ళీ ఏడ్చి, ఆమెని హత్తుకుంటూ చెప్పాడు.

"మొదటినించీ నాకు ఆడవాళ్ళంటే చులకనే. దానికి తోడు మన పెళ్ళి కుదరగానే మా నాన్న పిలిచి చెప్పాడు.

"అబ్బాయ్! పెళ్ళాం అంటే బెల్లం అన్నట్లు చూసావనుకో ఇక నీనెత్తిమీదకెక్కి దిగదు. ఆడవాళ్ళని ఎక్కడ ఉంచాలో అక్కడే ఉంచాలి. భవిష్యత్తులో పిల్లల్ని కూడా గారాబం చేసి పాడుచేయవాకు. గంభీరంగా ఉంటేనే తండ్రి మీద భక్తిశ్రద్ధలు ఉంటాయి. ఆఁ అనగానే ఆగేట్లు భయం పెట్టు."

"అప్పుడు నాకు మా నాన్న చెప్పింది మంత్రోపాఠమైంది. నిజంగా నిన్నో మనిషిగా ఎప్పుడూ చూడలేదు. పిల్లల స్కూలు ఫీజులు కట్టడం తప్పించి వాళ్ళ చదువు సంధ్యలు పట్టించుకోలేదు. కానీ మీరు ఈ కష్టకాలంలో నాకెంత అండగా ఉన్నారు" అతను మళ్ళీ ఏడవసాగాడు.

ఇందుమతి మౌనంగా వింటూండిపోయింది. నిజమే పెళ్ళయిన ఈ ముప్పైమూడేళ్ళలో అతను తననేం పట్టించుకోలేదు. ఎప్పుడూ ధుమధుమలాడుతూ రుసరుసలాడుతూండే అతన్ని చూస్తేనే భయం వేసేది. ఏభైల్లోకి వచ్చాక నిర్లిప్తత వచ్చిందికాని ఇరవై, ముప్పైల్లో ఉన్నప్పుడు ఎంతో బాధగా ఉండేది. సాయంత్రాలు బాల్కనీలో నుంచుంటే స్కూటర్ల పైన షికార్లకి వెళ్ళే జంటలు కనిపించేవి. భార్యలు భర్తల భుజానో, నడుం చుట్టూనో చేతులు వేసి అతని భుజం మీద గడ్డం ఆనించి కబుర్లు చెప్తూండేవాళ్ళు. కొందరు కిలకిల నవ్వుతుండేవాళ్ళు. తనకీ భర్త ఉన్నాడు. తమకి స్కూటర్ కూడా ఉంది. కానీ లేనిది అతనిలో సరసం. ఓసారి తను వంటరిగా పుట్టింటికి వెళ్ళినప్పుడు చెల్లెలు, మరిది కూడా వచ్చారు వాళ్ళ కబుర్లు, సాన్నిహిత్యం, ఒకరిమీద మరొకరికి ఉన్న ప్రేమని గుర్తించగానే తనేం కోల్పోయిందో ఇంకా బాగా అర్థమైంది. స్వంత చెల్లెలి మీద ఈర్ష్య పడింది.

పిల్లలు కూడా ఆ తండ్రితో ఎన్ని బాధలు అనుభవించారో తనకి తెలుసు. ఐనా మాట బయటకి రాకుండా గుట్టుగా ఈ సంసారాన్ని ఈది వాళ్ళని జీవితాల్లో స్థిరపడేట్లు చేసింది.

ఏదో రోజులు గడిచిపోతున్నాయి అనుకుంటే రిటైర్మెంట్‌కి రెండేళ్ళు ముందు అతనికీ అపవాదు. ఎప్పుడూ అనడం తప్పించి, అనిపించుకునే అలవాటు లేని కృష్ణమూర్తి ఈ పరిణామానికి ఉక్కిరి బిక్కిరవుతున్నాడు. మానసికంగా బాగా కృంగిపోయాడు. 'ఇప్పుడాయనకి భార్యాపిల్లలకి చేసిన అన్యాయం గుర్తొచ్చింది' అనుకుంది. నిజానికి ఆమెకి నవ్వొచ్చింది. నవ్వితే బావుండదని దాన్ని ఆపేసింది.

రాత్రి పన్నెండుగంటలకి కృష్ణమూర్తి భార్యని పిలిచాడు.

"ఇందూ"

"మంచినీళ్ళు కావాలా?" కళ్ళు మూసుకునే అడిగింది.

"వద్దు ఇలా నా దగ్గరగా వచ్చి పడుకో" భార్యని దగ్గరకి లాక్కున్నాడు.

"ఇంకా నిద్రపోలేదా? ఆరోగ్యం ఏమైపోతుంది పడుకోండి" ఆమె మృదువుగా మందలించింది.

"ఇందూ ఈ కష్టకాలంలో నాకు ఎంతో అండగా ఉన్నావు. నీకో బహుమతి ఇస్తాను. ఏం కావాలి?" అడిగాడు.

"ఏమిటీ?" ఆశ్చర్యంగా అడిగింది.

"నీకు గిఫ్ట్ ఇద్దామనుకుంటున్నాను. ఏం కావాలో చెప్పు" ప్రేమగా అడిగాడు.

"నిజంగానా?" నమ్మలేనట్లు అడిగింది.

"నిజంగా"

"ఐతే ఆలోచించి రేపు చెప్తాను."

"సరే నువ్వేం కోరినా కాదనను. గుర్తుంచుకో" అభిమానంగా చెప్పాడు. తర్వాత అతను నిద్రపోయాడు కానీ ఆమెకి నిద్రపట్టలేదు.

"ఆలోచించావా?" మర్నాడు కాఫీ గ్లాసు అందుకుంటూ అడిగాడు.

"ఆఁ మరి మీరు మాట మీద నుంచోవాలి. నో అనకూడదు" అనుమానంగా చెప్పింది.

ఆమె డైమండ్ నెక్లెస్‌లాంటి ఖరీదైన కోరిక కోరబోతోందని అతనికి అర్థమైంది. 'పోన్లే పాపం ఇన్నేళ్ళలో ఏమీ ఇవ్వలేదు' జాలిగా అనుకుని చెప్పాడు.

"పర్లేదు అడుగు ఎంత ఖరీదైనా నో అనను."

అతని చేతిలోని ఖాళీ కాఫీ గ్లాస్‌ని సింక్‌లో పెట్టి వచ్చి అతని పక్కన కూర్చుని చెప్పింది.

"మీరు నన్ను తిట్టకూడదు"

"తిట్టను. చెప్పు"

"కాదు. అదే నా కోరిక. మీరు నన్ను తిట్టకూడదు."

"ఏమిటీ?" తెల్లబోయాడు.

"అవును మీరు నన్నెప్పుడూ తిడుతూ వుంటారు. చిన్న చిన్న విషయాలకే మీకు కోపం వచ్చి ఉగ్రంగా అరుస్తారు. పక్కన ఎవరున్నారు, మనం ఎక్కడున్నాంలాంటివి ఆలోచించరు. బస్టాండ్స్, రైల్వేస్టేషన్లు, పెళ్ళిళ్ళల్లో, చుట్టాలు, పనివాళ్ళు, కొత్తవాళ్ళముందు అరుస్తూంటే నాకు అవమానంగా ఉంటుంది. కోపాన్ని కొంచెం కంట్రోల్ చేసుకుని తర్వాత ఏకాంతంగా చెప్పచ్చుగా అనుకుంటాను ఎప్పుడూ. మీరు బహుమతి అన్నారు కాబట్టి ఇది కోరుకున్నా. చూస్తా మరి మాట మీద ఎంతవరకూ ఉంటారో" ధైర్యంగా చెప్పింది కానీ ఆమె కళ్ళల్లో నీటి తెర.

కృష్ణమూర్తి ఆ తర్వాత చాలాసేపు ఆవిషయం గురించే ఆలోచించాడు గిఫ్ట్ అన్నప్పుడు బంగారం అడుగుతుందనుకున్నాడు కానీ ఇలాంటి బహుమతి కోరుకుంటుందనుకోలేదు. అంటే ఇందుమతి తన కోపానికి ఎంత బాధపడుతోందో!

వంటగదిలో పనిచేసుకుంటున్న భార్య దగ్గరకి వచ్చి చెప్పాడు.

"అలాగే, నిన్ను అసలు అరవను. తిట్టను ఒకవేళ మర్చిపోతే 'గిఫ్ట్' అని హింట్ ఇవ్వు అలవాటయ్యేదాకా. ఠక్కున ఆగిపోతాను."

ఇందుమతి భర్తవంక కృతజ్ఞతగా చూసింది.

"ఇందూ, నువ్వు నాకు చెప్పాలనుకుని చెప్పని విషయాలేమైనా ఉన్నాయా?"

ఆ రాత్రి ఆప్యాయంగా అడిగాడు.

"చాలా ఉన్నాయ్. పెళ్ళి కుదిరినప్పటినించి భర్తతో ఎలా ఉండాలి, ఇంటిని ఎలా తీర్చిదిద్దుకోవాలి అని చాలా కలలు కన్నాను. తర్వాత వాటి అవసరం లేకపోయింది మర్చిపోయాను" నిర్లిప్తంగా చెప్పింది.

"నిన్ను బాగా హర్ట్ చేసాను నాకు తెలుసు. కానీ నాకో అవకాశం ఇవ్వు. నా తప్పు ఒప్పుకున్నా కదా" బాధగా చెప్పాడు.

పెళ్ళయ్యాక హనీమూన్‌కి కాశ్మీర్ వెళ్దామనుకున్నాను. డాల్ లేక్‌లో హౌస్ బోట్‌లో ఇద్దరమే ఉంటే ఎంత రొమాంటిక్‌గా ఉంటుందో అనుకున్నాను."

"ఓ! మనిద్దరం ఎక్కడికీ విహారయాత్రకే వెళ్ళలేదు కదా? ఈ గొడవ అయిపోయిన తర్వాత మనం శ్రీనగర్ వెళ్దాం నీ కోరిక ఎంత స్ట్రాంగ్ అంటే ముప్పై మూడేళ్ళ తర్వాత నిజమౌతోంది" గిల్టీగా చెప్పాడు.

"పర్లేదు. మీరు అడిగారని చెప్పాకాని, ఇప్పుడా కోరిక లేదు"

"నాకుంది మనం వెళ్దాం" ప్రేమగా చెప్పాడు.

కృష్ణమూర్తిని బెదిరించిన అమ్మాయి, ఒరిస్సాలో కూడా ఓ ఫేక్టరీ యజమానిని బెదిరించింది. ఆ గదిలో ఉన్న సిసిటివి ఫుటేజ్‌లో ఆ సంఘటనతో పాటుగా 'హైదరాబాద్‌లో కృష్ణమూర్తి అనేవాడిని ఇలాగే ఇరికించాను సస్పెండై ఇంట్లో కూర్చున్నాడు' అనే ఆ అమ్మాయి మాటలు కూడా రికార్డయ్యాయి.

ఆ సాక్ష్యంతో కృష్ణమూర్తి మీద కేసు కొట్టేసారు. వెంటనే ఉద్యోగంలో చేరమని ఆఫీస్‌నించి ఉత్తరం వచ్చింది.

మంచిరోజు చూసుకుని, ఆఫీస్‌కి తయారవుతున్నాడు కృష్ణమూర్తి. కేబుల్ టివి అబ్బాయ్ వచ్చి, ఆర్నెల్ల సబ్‌స్క్రిప్షన్ కిందటి నెలే అయిపోయిందని, ఆ నెలకి డబ్బు కట్టమని అడిగాడు.

"ఇదింకా జూనే. నేను అగస్ట్ దాకా కట్టాను" కృష్ణమూర్తి చెప్పాడు.

"లేదు సార్. మే దాకా కట్టారు. నవంబర్ చివర్లో కట్టారు" వాడు ఓపికగా వివరించాడు.

"రసీదు ఉందిగా చూసి చెప్తాను... ఇందూ....ఇందూ" కృష్ణమూర్తి అరిచాడు.

వంటగదిలోని ఇందుమతి పరుగున వచ్చింది.

"కేబుల్ టివి వాళ్ళు ఇచ్చిన రసీదేది?" అడిగాడు.

"ఏ రసీదు? నాకేం తెలీదే? మీరే కట్టారుగా అప్పుడు. మీకే ఇచ్చి ఉంటాడు. ఎక్కడ పెట్టారో" చెప్పింది.

"అంటే నేను డబ్బు కడితే, రసీదు కూడా నేనే దాచాలా? ఇంట్లోనే ఉంటావుగా? ఏ కాగితం ఎప్పుడు అవసరం వస్తుందో దాచాలని తెలీదూ?" పెద్దగా అరవసాగాడు కృష్ణమూర్తి.

మళ్ళీ వస్తానన్నట్లుగా ఆమెకి సైగ చేసి కేబుల్ వాడు వెళ్ళిపోయాడు.

"ఈ మొహానికి కాశ్మీర్ వెళ్ళి డాల్ లేక్‌లో షికార్లు చేయాలని కోరికట! చిన్నకాగితం ముక్క దాచడం రాదు కానీ హౌస్ బోట్లో ఏకాంతంగా ఉండాలనే రొమాంటిక్ థాట్స్‌కేమీ తక్కువలేదు.." కృష్ణమూర్తి అరుస్తూనే షూస్ వేసుకుంటున్నాడు.

'గిల్ట్' అనాలన్న ఆలోచనే రాని ఇందుమతి భర్తవంక తెల్లబోయి చూస్తూండిపోయింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments